పునర్లబ్ధము

ఉదయము ఎనిమిది గంటలకు 'కస్తూరిబాయి నర్సింగు హోము' ముందర కారు ఆపి శ్రీనివాసరావు రాధ లోపలికి వెళ్ళారు.

సంప్రతించవలసిన సమయానికి సరిగా డాక్టరు ఆ గదిలోకి వచ్చి కుర్చీ మీద కూర్చున్నాడు. అక్కడికి వచ్చిన వాళ్ళలో రాధ పన్నెండవది. ఆమె తరువాతకూడా చాలామంది వచ్చారు. రోగులు 'క్యూ'లో నిల్చున్నట్లుగా ఉన్నారు.

రాధవంతు వచ్చేసరికి పదిగంటలు కావచ్చింది. రోగి భర్తను పిలిచి, ఆయన ముందర రోగిని పరీక్షచేశాడు డాక్టరు శంకరము.

శ్రీనివాసరావును కాస్త అవతలికి తీసుకొని వెళ్ళి ఆమె వినకుండా నెమ్మదిగా చెప్పాడు డాక్టరు. శ్రీనివాసరావుకు ఆయనమాటలు వినగానే చెమటలు పోశాయి.

"అయితే ఏమంటారు? ఇక్కడ ఉంచటము తప్పంటారా?"

"తప్పకుండా ఉంచాలి. క్షయక్రిందకి దింపే సూచనలున్నాయి. ప్రారంభములోనే సరైన చికిత్స నడిపితే తగ్గిపోతుంది. చూశారా క్షయవ్యాధి భయంకరమైనది. ఆవ్యాధి వచ్చినవారు నష్టమయిన సరుకుక్రింద లెక్క. ఈమెను, మా నర్సింగ్‌హోములో ఉంచండి. ఇళ్ళలో జరిగే అశ్రద్ధలు జరుగవు. సరిగా రెండు నెలలు-లెక్కపెట్టి-ఉంచండి. ఇంక మీరు ఏవిధమయిన బెంగపడనక్కరలేదు..

"ఎంత అకస్మాత్తుగా జరిగిందనుకున్నారు? సినిమాకు వెళ్ళిన ఒక గంట వరకు బాగానే ఉంది. నేను డ్రింకుతెచ్చి, చేతికిచ్చేసరికల్లా ఆ చేతికి పట్టులేదు. కాళ్ళు చేతులు చలువలుకమ్మాయి - నోట్లోంచి నురుగు-కళ్ళు మూసుకుపోవటము- అన్నీ ఒక్కసారి జరిగాయి."

"ఎన్ని దినాలనుంచి ఉన్నదో-నిన్న పైకి కనిపించింది. శ్రద్ధతో చికిత్స చేస్తే అన్నీ తగ్గిపోతాయి. ఇక మీరు నిశ్చింతగా ఉండండి,"

"నిన్నటినుంచీ నా మనసు చాలా ఖేదపడుతోంది, డాక్టరుగారూ! నా జన్మకు సుఖమనేది లేదు." కళ్ళనీళ్ళు ఆపుకుంటూ గొంతు సవరించుకొని "నా మొదటిభార్యకు పురుడువచ్చిన నెలకు పిచ్చిఎక్కింది. ఏ మందువాడినా, కొంత కాలానికిగాని తగ్గదని డాక్టరు అన్నాడు. కొట్టటము-తిట్టటము; ఇంట్లో ఉంచుకోవ టము దుర్భరమయిపోయి, డాక్టర్ల సలహామీద విశాఖపట్టణములో ఉంచాను. తొమ్మిది సంవత్సరాలయినా, మార్పు లేకపోవటంవల్ల, రెండేండ్లక్రింద ఈమెను వివాహము చేసుకున్నాను. ఇంతలోకే ఈ విఘాతము."

"మీరు ఏమీ భయపడవద్దు. నియమంగా ఆహారము-పరిచర్య-ఔషధసేవ జరుగుతాయి. డబ్బుకు మాత్రము వెనుదీయకండి."

"మీరు ఎంతకావాలంటే అంతకు సిద్ధము. నా జన్మంతా యింతేనా అని కుమిలిపోతున్నాను."

"వారికొక గది ప్రత్యేకించుతాము. అవసరమయిన ఏర్పాట్లన్నీ జరుగు తాయి. ఉదయంగాని సాయంకాలంగాని మీరు రావచ్చును. ఒక నెలబిల్లు అడ్వాన్సు కట్టండి, మిగిలినవి మేము చూస్తాము. కాని చూడండి-ఆమెకు మనసు కలత చెందకుండా చూడాలి. బిడ్డలున్నారా?"

"లేరు."

"సరే నేను సెలవు తీసుకుంటాను. చెప్పవలసినవన్నీ చెప్పినట్లేగా" అంటూ డాక్టరు శంకరం ప్రక్క గదిలోకి వెళ్ళాడు.

"రాధా! నేను రెండుపూటలూ వచ్చి చూస్తాను. నీ కెప్పుడు ఏది కావా లంటే, అది పనివాడిచేత తెప్పించుకో. వాడు ఇక్కడే ఉండేటట్లు ఏర్పాటుచేస్తాను దేనికయినా, అవసరానికి ఈ రూపాయలు ఖర్చుపెట్టు. నెలబిల్లు అడ్వాన్సు యిచ్చాను. ఏం? నిశ్శబ్దంగా, చిన్నబోయిన ఆ యింట్లో, మురళీ నేను ఎట్లా ఉండగలమా అని ఆలోచిస్తున్నాను. నీవు లేకపోతే మురళి దిగులు పడడు? అయినా రెండు నెలలేగాని........"

"రెండు నెలలు? అంతకాలము నన్ను ఇక్కడ ఖైదీగా ఉంచుతారా? ఈ మాత్రపు దానికి ఇక్కడ ఉండటము అనవసరముకాదా? డాక్టర్లకేం? చెప్తారు. వాళ్లకేమన్నా మన కష్టసుఖాలు అర్ధమవుతాయా? మీరు అనవసరంగా లేనిపోని ఆదుర్దా పడుతున్నారు."

"దేనికయినా జాగ్రత మంచిది చూడు. మురళికి ధైర్యము చెప్పు. అదిగో నీ గడ్డము వణుకుతోంది. అదే వద్దన్నాడు డాక్టరు. సాయంకాలము నాలుగు గంటలకు ఇద్దరము వస్తాము. నీకు చదువుకోటానికి పుస్తకాలు పంపుతాను. ఇంక వెళ్ళనా?"

రాధ ముఖము ప్రక్కకు త్రిప్పుకొని కళ్ళు తుడుచుకుంటుండగా, వెనక్కి చూడకుండా శ్రీనివాసరావు భారంగా నడుస్తూ వెళ్లిపోయాడు!

ఆ సాయంకాలము నాలుగు గంటలకు కాఫ్యాదులు ముగించుకొని శ్రీనివాసరావు మురళితో సహా నర్సింగ్‌హోముకు వచ్చాడు. తండ్రి సరిగా భోజనము చేయలేదనీ, కాఫీ త్రాగలేదనీ, తల్లితో చెప్పుదామనుకొన్న మురళికి, వాచి ఎఱ్ఱగాఉన్న తల్లి ముఖము చూసేసరికి దుఃఖము ఉబికివచ్చింది.

కులాసాగా కబుర్లతో ఒక గంట గడిపి, బరువెక్కిన హృదయంతో మురళీ చేయి పట్టుకొని శ్రీనివాసరావు ఇల్లు చేరాడు. అరమైలు దూరము గంటన్నర నడిచాడు. ఆ రాత్రి కన్ను మూతపడలేదు. తనకు కళత్ర స్థానములో పాప గ్రహాలు కూడినట్లున్నాయి. కాకపోతే ఒకరయినా సరిగా ఉండకూడదూ!

ఆఫీసుకు వేళకు వెళ్ళి యింటికి రావటము. మురళితో నర్సింగుహోముకు వెళ్ళటము, తిరిగి ఇంటికి వచ్చి భోజనంచేసి పడుకోవటము. కలతనిద్రతో, శ్రీనివాసరావు ఒక నెలకల్లా చిక్కి సగమయ్యాడు. పాలిపోయిన ముఖము-సంతోషము లేని నవ్వు-రాధ కనిపెట్టింది. ఒంటరితనము-మనసులో దిగులు!

తీర్చిదిద్ది, అందాల పోటీకి నిలబెట్టినట్లుంది రాధ విగ్రహము బాల్యంలోనే. తల్లీ తండ్రీ కరవయిపోతే బంధువులంతా పట్టించుకోకపోగా వెలివేశారు రాధను. పరిచయస్థులంతా చందాలు వేసుకొని, అనాధ శరణాలయంలో చేర్చారు. రాధ పెద్దది కాకపూర్వమే వాళ్ల జాలి కాఠిన్యరూప మెత్తింది. శరణాలయాధికారుల

ఆదరంవల్ల అక్కడికి వచ్చి, చూచిపోయే వారి అభిమానమువల్ల, బి. ఏ. వరకు వచ్చింది.

పదిహేను సంవత్సరాలు శరణాలయంలో గడిపింది రాధ, చింపిరి జుట్టుతో జీర్ణవస్త్రాలతో – వచ్చిన ఏడు సంవత్సరాల పిల్ల పట్టభద్ర అయింది! కాని, ఇప్పుడు ఎక్కడికని వెళ్లుతుంది? ఆమె కెవరున్నారు? శరణాలయంలోఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నది.

ఆనాడు శుక్రవారము. ఉదయం పది గంటలకు రాధగదిలో కూర్చొని ఆలోచిస్తున్నది. లోకంలో 'నా' అన్నవాళ్లు లేకపోతే ఎంత కష్టము? తననింత పైకితెచ్చిన శరణాలయమువారు తన కెంతో పూజ్యులు. వాళ్లకు తనంటే ఎంతో అభిమానము. కాని ఆ పుత్రప్రేమ ఎట్లా ఉంటుందో? అనుభవమూ లేదు–లోకం చూడనూలేదు; ఏదో పుస్తక పరిచయము తప్ప, పెండ్లిచేసుకొని సంసారజీవనం చేస్తే? ఆ విషయం తనంతట తానే ఆలోచించుకోవాలో, ఎవరయినా నిర్ణయము చేస్తారో అంతకంటె అర్థము కావటంలేదు కాకపోయినా, పెండ్లి తనవంటివారు తలపగూడని సమస్యేమో? చదువుకుంటూ ఉన్నన్ని దినాలు ఏ సమస్యలు లేకుండా కాలం కడిచింది. కాని యిప్పుడు అన్నీ సమస్యలే. చదువుకుంటూ శరణాలయంలో ఉంటే అర్థమున్నదిగాని-ఊరికే తింటూ ఎన్నాళ్ళు? తన మనసు నొచ్చకుండా వాళ్ళు ఏదో గౌరవమైన పనులు చెప్తూ ఉంటారుగాని.... పేపర్లో చూసిన ప్రకటన కల్లా దరఖాస్తు పంపిందిగాని అందులో ఒక్కదానికయినా జవాబు రాలేదు. గౌరవ మైన వృత్తులు స్త్రీలకు బోలెడున్నాయి. కాని తనను-ఒంటరి జీవిని–ఎవరు కడుపు లో పెట్టుకొని. కష్ట సుఖముల బాధ్యత వహిస్తారు? ప్రతి నిమిషానికి క్రుంగటం మొదలుపెట్టింది అప్పుడే కాలేజీ వదలి పెట్టడము, చాలినంత లోకానుభవము లేక పోవటము దిగులుకు అనువైనయి.

ఇంతలో తపాలామనిషి వచ్చి పిలిచేసరికి గుండె గబగబ మన్నది. తనకు ఉద్యోగము వచ్చినట్లు, తెలిపేవాడు ఆ దేవుడేగా! 'అమ్మా' అని పిలవగానే, అమాంతము లేచి వెళ్లింది గడపలోకి తెచ్చిన ఉత్తరము చింపి, చదివి, "చూడూ! ప్రస్తుతము నీ కివ్వదగినది నా దగ్గర ఏమీలేదు. ఈచీరె తీసుకో! నీ భార్యకియ్యి!" అని తన చీరెలలోంచి ఒకటి తీసి ఇచ్చింది.

ఉత్తరము మరొకసారి చదువుకుంది. తనకు ఉద్యోగము వచ్చింది! ఎంతో అంత ఇస్తారు. తన తిండి తాను తినవచ్చు. ఎంత ఇస్తే నేం? తొంభయి రూపాయలకంటె తాను ఏంచేసుకుంటుంది? తాను ఎల్. టి. అయినా కాలేదు.

మళ్లీ తలుపును ఎవరో తట్టిన శబ్దము. కనుబొమల ముడితో తలుపు తెరచింది-వాళ్ళరాక తనకేమిటో చికాకును కలిగించినట్లుగా. శరణాలయాధికారి ఒక యువకుని వెంటబెట్టుకొని వచ్చాడు. అతడెవరయితే తనకేమిటి, ఒక గంటక్రింద తానూ ఒక ఉద్యోగి అయింది. ఈ ఆలోచనతో వాళ్ళను కూర్చోమనటముకూడా మరచిపోయి, కళ్ళురెండూ ఒప్పగించి ఊరుకుంది.

"రాధా! మేము నీతో కొన్ని విషయాలు మాట్లాడాలని వచ్చాము. వీరు శ్రీనివాసరావుగారు. శరణాలయానికి మొదటినుంచీ చేతనయినంత సహాయము చేస్తున్నారు. భవనము పూర్తిఅయిన అరువాత చూడలేదని వచ్చారు. నీకు వీరిని పరిచయము చేయాలని నీ గదికి తీసుకొని వచ్చాను."

తల ఎత్తకుండానే 'సరే' అన్నట్లుగా తల ఊపింది రాధ.

"నీవు పరీక్ష ప్యాసయావు. చదువు పూర్తిచేశావు. నీ భారము వహించే బంధువులు ఎవరూ నీకు లేరు. నీ విషయంలో కొంతభారము మేము వహించవలసి ఉన్నది. ఇప్పుడు కాకపోయినా, ఇంకా కొన్నాళ్ళకయినా నీకు ఉ్యదోగము దొరకకపోదు. కాని నీకు 'నా'అన్నవాళ్ళు ఎవరూ లేరు. కాబట్టి ఉద్యోగంకన్న ముందర వివాహమే యోగ్యమైన సలహా అని భావిస్తున్నాను బాగా ఆలోచించుకో. మీ కులస్థులు శ్రీనివాసరావుగారు, వయసు నలభయిలోపుగా ఉంటుంది. పిత్రార్జితము బాగా ఉంది. అదిగాక ఉద్యోగము చేస్తున్నారు. విజ్ఞానం విత్తంతో కూడా తనను అర్పించుకుంటానంటున్నారు. ఒక కొడుకున్నాడు చిన్నవాడు. నీ అభిప్రాయం చెప్పు. కాని నిన్ను ఏదోవిధంగా ఇక్కడినుంచి పంపాలని, నా ఉద్దేశ్యం కాదని గ్రహించుకో. నీ ఇష్టప్రకారమే, మేము ఏసలహా అయినా ఇవ్వగలము. మీ ఇద్దరు ముఖాముఖి మాట్లాడుకోవచ్చును. ఏమైనా సందేహాలుంటే తీర్చుకోవచ్చును."

రాధ తలఎత్తకుండానే కాలి బొటన వ్రేలితో నేల రాస్తున్నది.

చాల నేర్పుతో అయస్కాంతాన్ని ఇనుము ముందర పెట్టాడు అధికారి. రాధ ఏమంటుంది? ఈ సమస్యలో ఉదోగ్యపు సంబరము మరచిపోయి తన శ్రేయోభిలాషి అయిన ఆ పెద్ద మనిషికి తెలుపనైనా లేదు.

ఒకసారి తలఎత్తి శ్రీనివాసరావును చూడగానే తన కళ్ళయొక్క శక్తికొంత తగ్గినట్లనిపించింది రాధకు. సులోచనాల వెనుక మెరుస్తున్న శ్రీనివాసరావు కళ్ళను కాదనలేకపోయింది. మంగళసూత్ర మొకచేతిలో-మంత్రాక్షత లొకచేతిలో పట్టుకొని, దీవించటానికి సిద్ధంగాఉన్న శరణాలయాధికారిని వారించలేకపోయింది· ఒక్కసారే ఇద్దరూ నమస్కరించారు అధికారికి.

ఒక శుభముహూర్తమున దంపతులయ్యారు.

*   *   *   *

కొత్త కాపురం రాధకెంతో ముచ్చటగా ఉంది. మురళి ఎంత ముద్దుగా ఉన్నాడని! వాడిని చూసేసరికి తన చిలిపితనమంతాపోయి. తల్లియై సంరక్షణ చేయాలనిపించింది. 'అమ్మ!' అని పిలవటము. అన్ని పనులు తనచేత చేయించుకోవటము తమ ఇద్దరి నడుమ రాయబారాలు నడపటము- ఒక్కక్షణమైన తనను ఒంటరిగా ఉండనీయకపోవటము-అంతా వింత!

తండ్రీ అంతే. ఆఫీసునుంచి రాగానే. ఇల్లంతా వెతుక్కుంటూ వచ్చి ఆప్యాయంగా పలుకరించటము-తననొక దేవతగా చూడటము-ఆ ప్రణయ మూర్తులతోసహా తానా ఇంటిని పాలించటము! ఈశ్వరమాయ! శరణాలయంలో అనాథలతో పెరిగిన జీవి తాను, రూపాయ అంటే పదహారణాలా అని విస్తుపోతూ 'తన జన్మలో ఎప్పటికయినా అదృష్టము పట్టుతుందా' అని నిట్టూర్చే తనకేమిటి- సిరి సంపదలతో-అందచందాలతో-శ్రీనివాసరావు లభించట మేమిటి? ఎక్కడి కే దరి? ఇదంతా కలయేమోననీ. మెలకువ వస్తుందేమోననీ రాధ కొకొక్కసారి జలదరింపుగా ఉండేది.

శ్రీనివాసరావుకుగాని మరళికిగాని ఈమె సాహచర్యము—ఈమెరాక— సామాన్యంగా లేదు. మురళికైతే స్వర్గంలో ఉన్నట్లే ఉంది. శ్రీనివాసరావు ఇల్లాలిని ఎన్నడు ఎరుగనట్లే ఉన్నాడు. ఇంట్లో అగ్గిపెట్టె తేవటము దగ్గర్నుంచి తాను

కొనుక్కోవలసి వచ్చిన జన్మ తనది: బాధ్యతాయుత ప్రభుత్వమంటే అక్షరాలా తన ఇంటిలో ఇప్పుడు అమలులో ఉన్నదే: అది తన ఇల్లు కాదో-తాను శ్రీనివాసరావు కాడో- లేక తన కళ్ళను తానే నమ్మలేకపోతున్నాడో! అప్పుడప్పుడు దేవతలు శాపదగ్ధులై, భూలోకంలో జన్మిస్తారని పురాణాలు చెప్తాయి. ఆ బాపతేమో ఈ రాధ:- ఇదీ శ్రీనివాసరావు వరుస.

అతి మధురంగా గడచే రోజుకి ఇరవయినాలుగు గంటలే: ప్రకృతి చిత్రం:.

*   *   *   *   *

అక్కడికి రెండు దినాలనుంచీ రాధ తహతహలాడుతోంది. సాయంకాలం నాలుగు కాగానే రోగులందరికోసము విజిటర్లు గుంపులు గుంపులుగా వస్తారు. తన కోసము ఎవ్వరూ రావటములేదు. రెండుదినాలనుంచి, ఎదురుచూసి చూసి, కళ్లు కాయలు కాచే యనుకున్నది.

'అమ్మయ్య, మురళివచ్చాడీవేళ' అనుకొని మంచము మీదనుంచి లేచింది. కాని ఏడుపు ముఖంతో ఉన్నాడెందుకనో?

"మురళీ! విన్నా మొన్నా రాలేదేమిరా? నాన్నగారు కూడా రాలేదేం?" అంటూ దగ్గరికి తీసుకుంది. బుజ్జగిస్తూ అడిగేసరికల్లా మురళి బావురుమన్నాడు. ఎక్కు వచ్చేవరకు ఏడ్చాడు సంగతేమిటో చెప్పకుండా.

ఎంతోసేపు బ్రతిమిలాడగా, బయటపెట్టాడు. నాన్నగారు చికాకుగా ఉన్నారనీ, ఊరినుంచి ఒకావిడ వచ్చిందనీ, తనకు తల్లినని చెప్తున్నదనీ, వాళ్ళిద్దరూ వాదించుకుంటూ నడుమ తనను కొట్టారనీ. తనను నర్సింగుహోముకు వెళ్లవద్దంటే తానాదినము తప్పించుకొచ్చాననీ ఏకరువు పెట్టాడు.

"నీవెప్పుడు వస్తావమ్మా ఇంటికి? నా పాఠాలన్నీ పోతున్నాయి. నాబొమ్మల ఆల్బములోకి కొత్త బొమ్మలు లేవు. నాన్నగారు పెట్టిన పంతులు రానే రావటము లేదు. నాన్నగారు కనుక్కోనయినా కనుక్కోరు. ఈ దినమునుంచీ నేను ఇక్కడే ఉంటా' నంటూ మారాము చేశాడు.

"చూడు మురళీ:ఇక్కడ రోగులుతప్ప మంచివాళ్లు ఉండరు. డాక్టరుగారితో చెప్పి నేనే తొందరగా వస్తానుగాని నీవు ఇంటికి వెళ్లు. మా నాయన మురళి మంచి

వాడు, ఉప్పుసత్యాగ్రహం చేస్తున్న గాంధి-కస్తూరీబాయి సమేతుడయిన గాంధి-వైస్రాయితో మాట్లాడుతున్న గాంధి-ఈ మూడు గాంధి బొమ్మలను, నీ ఆల్బమ్‌లో మూడు కాగితాలమీద మూటివి అంటించుకో, కొత్త ఆల్బములో, మొదటి పేజీమీద నేనిచ్చిన బుద్ధుని బొమ్మ అంటించు. అన్ని ఆల్బములు నీట్‌గా ఉండాలి. అన్నముపెట్టి అంటించేటట్లయితే బొమ్మల కాగితానికి ఎత్తుపల్లాలు వస్తాయేమో. చూసుకో బాబూ. చీకటి పడుతుంది. ఇంటికి వెళ్ళమ్మా'' అంటూ మురళిని ఇంటికి పంపింది. రాధ హృదయము పాదరసం అయింది,

* * * * *

రాధ నర్సింగుహోములో ఉండి ఉపచారము పొందటము అయింది, ఇంటికి వెళ్ళి నిశ్చింతతో ఉండవచ్చునని డాక్టరు చెప్పాడు.

రాధ ఇంటికి చెప్పి పంపదలచుకోలేదు. కొన్నాళ్లుగా శ్రీనివాసరావు ముఖం కనబరచటములేదు. అతడు తప్పించుకొని తిరుగుతున్నట్లుగా కనబడుతున్నది సంగతి చూస్తే. ఆ స్థితిలో తానెందుకూ తనసంగతి జ్ఞాపకము చేయటము?

ఇవ్వవలసిన బిల్లు ఇదివరకే శ్రీనివాసరావు చెల్లించాడు. మిగిలిన చిల్లర ఖర్చులు తన దగ్గరున్న డబ్బుతో పెట్టింది. ఆమె బట్టలు చాలావరకు నర్సింగు హోములోనే ఉన్నాయి. ఇక్కడినుంచి శ్రీనివాసరావుకు తెలియకుండా ఎట్లా గయినా ప్రయాణము కావాలి.

ఆమె టాక్సీకారు తెప్పించుకొని స్టేషనుకు వెళ్ళింది. సరిగా మద్రాసుకు వెళ్లేరైలు ఇంకో అరగంటలో బయలుదేరుతుంది.

తాను ఎక్కడినుంచి ఇక్కడికి వచ్చినదో-ఇప్పుడు తిరిగి అక్కడికే-మద్రాసుకే, వెళ్ళిపోవలెనని టికెటు కొన్నది.

వెయిటింగురూములో కూర్చుని తన సంచిలో దాచిఉంచిన తన ప్రణయ మూర్తుల ఫోటోలను చూస్తున్నది.

అనాథ అయిన తనకు అమరుల సాహచర్యము ఎంత అకస్మాత్తుగా కలిగిందో-అంత ఆకస్మికముగానే విడిపోబోతున్నది!

ఆ మూర్తుల సాహచర్యము ఇప్పుడొక పెద్దబాధ అయింది.

ఇంతలోకే ఏమూలనుంచో, 'ఇక్కడికి ఎట్లా వచ్చావమ్మా' అంటూ మురళి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

దిగ్భ్రాంతితో ఆమె మురళిని దగ్గరకి తీసుకొన్నది.

వెనుకనుంచి వస్తున్నాడు శ్రీనివాసరావు ఇంకొక ఆమెతో. మురళిని రాధనుచూసి ఒక్కఅంగలో సమీపించాడు.

"రాధా! ఇక్కడికెట్లా వచ్చావు? ఎక్కడికి వెళ్లాలని?" అంటూ ఆమె రెండు చేతులను తన చేతులతో పట్టుకున్నాడు.

రాధవైపు మొదలు చురచుర చూసిన సావిత్రి, "రాధంటే! ఈమేనా తన వాళ్ళను మంత్రముగ్ధులను చేసినది ఈ వ్యక్తేనా?" అనుకుంటూ వాళ్ల ముగ్గురి వైపు చూసింది.

అదేమిటో–వాళ్ల నోటిమాట లేకుండా ప్రతిమలవలె నిలబడి పోయినారు! ముత్యాలలాగ కన్నీటిబొట్లు బొటబొట నేలమీద పడుతున్నాయి.

మరొకసారి వాళ్ళను చూసేసరికి సావిత్రి మనసు వెన్నలా అయింది. బాధ పడుతున్నవాళ్ల సంగతి బాధపడ్డవాళ్లకే తెలుస్తుంది.

"రాధా! వీళ్లిద్దరిని నీ దగ్గరనుంచి తీసుకొని వెళ్ళాలని నేను వచ్చాను. ఆ తరువాత నీ భవిష్యత్తు నీవే నిర్ణయము చేసుకుంటావని అనుకున్నాను. నీ పరోక్షాన నా మనసెంత దహించుకొని పోయిందో – నీ సమక్షాన అంత ఆనందము అనుభవిస్తోంది. నీ సాహచర్యంలో వీళ్ళిద్దరు ప్రణయ మాధుర్యాన్ని రుచిచూశారు. నా కంటె నీవే వీళ్ళిద్దరికి సన్నిహితురాలవు. ఒంటరి జీవితానికని వీళ్లఫొటోలు తీసుకొని బయలుదేరినట్లున్నావు. నీ సామానులన్నీ టికెటుతోసహా నాకివ్వు." అంటూ సావిత్రి సామానులన్నీ రైలులో పెట్టించుకొని ఎక్కి కూర్చున్నది.

విషువమంటే పాముకు కోపము వస్తుందో–కర్రవమంటే కప్పకు కోపము వస్తుందో–అని తలమునకలుగా ఉన్న సమస్యను ఏ విధంగా పరిష్కారము చేయాలని ఆలోచిస్తున్న శ్రీనివాసరావు, సావిత్రిచేసిన మార్పును గ్రహించుకోలేక, కదలపోతున్న రైలు దగ్గరకు వెళ్ళాడు.

"రాధ చెన్నపట్నము వరకు టికెటు తీసుకొన్నది. మద్రాసునుంచి అరుణాచలము భగవాన్ దగ్గరికి వెళ్తాను. మూర్తిత్రయము సుఖముగా ఉండ కోరుతాను. సెలవు" అని సావిత్రి అంటుండగా మిగిలిన మాటలు రైలు రొదలో కలిసిపోయాయి.

పొగడపూలచండ ఘుమఘుమవలె- ఆనందము వెదజల్లుకుంటూ, ముగ్గురూ గృహోన్ముఖు లయ్యారు. మళ్ళీ ఒకరి కొకరు దైవికంగా లభించారు-ముచ్చటగా!